
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



సోమశిలలో 38.708 టీఎంసీలు

జలాశయంలో శనివారానికి 38.708 టీఎంసీలు ఉన్నాయి. 15,836 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పవర్ టర్నెల్ ద్వారా 1850, ఉత్తరకాలువకు 370, కండలేరుకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,04,370
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,445
3 శాతం జీఎస్టీతో	రూ.9,728
సవర (8 గ్రా)	రూ.77,824

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.4 /26.3

జిల్లాలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరుగా వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. శనివారం గాలిలో తేమ 66 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ తప్పనిసరి

- ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌ఓ తనిఖీ



ఓ ప్రైవేట్ ఆస్పత్రి రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ తదితరులు

నెల్లూరు (అర్బన్): ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు నిర్వహిస్తున్న డాక్టర్లు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ సుజాత తెలిపారు. నమోదు చేసుకుని గడువు ఐదేళ్లు పూర్తవుతున్న వారు ఒక నెల రోజులు ముందుగానే ఆన్‌లైన్ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం డీఎంహెచ్‌ఓ సుజాత నగరంలోని నారాయణ, అపోలో, ఎనెల్ తదితర పలు ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న సేవలు, వివరాల రికార్డులను పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనల ప్రకారం నడుస్తున్నాయా.. లేదా తెలుసుకునేందుకు 13 మంది అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసి ఈ నెల 13వ తేదీ వరకు తనిఖీలు జరిపిస్తున్నామన్నారు. ఆస్పత్రులను ఆంధ్రప్రదేశ్ అల్లోపతి క్లినికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ 2002 ప్రకారం నమోదు చేసుకోకుండా ఉంటే అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం తప్పని సరిగా పొల్యూషన్, ఫైర్, బయోమెడికల్ వేస్టేజీ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ఆస్పత్రులు అందిస్తున్న సేవలు, అందుకు వసూలు చేస్తున్న ధరలు బోర్డులో ప్రదర్శించాలన్నారు. ఓపీ, ఐపీ రిజిస్టర్లు, కేస్‌షీట్లు పక్కాగా ఉండాలన్నారు. ఈ తనిఖీల్లో ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ భాస్కర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి విద్యుత్ క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఈపీడీసీఎల్ నేతృత్వంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఇంటర్ సర్కిల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సర్కిల్ స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ రామస్వామివేలు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి, అర్హత ఉన్న జిల్లా సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 ఉద్యోగులు అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఈ నెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలోని మైడ్రీమ్ క్లబ్‌లో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 90308 02038, 98851 84450 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌కు చాకిచర్ల విద్యార్థి



చైతన్యకృష్ణ

ఉలవపాడు: రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌కు చాకిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చైతన్యకృష్ణ ఎంపికైనట్లు వ్యాయామ అధ్యాపకుడు ఓగుబోయిన శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి ఈ నెల 10వ తేదీలో విశాఖపట్నం పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో జరిగే సబ్ జూనియర్ షాట్‌పుట్ విభాగంలో నెల్లూరు జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన పారా స్పోర్ట్స్ క్రీడల్లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థి ఎంపిక కావడంతో హెచ్‌ఎం జనార్దన్ అభినందనలు తెలిపారు.

బియ్యం బొక్కేస్తున్నారు..

రేషన్ గోడౌన్ల నుంచే దోపిడీ దందా



పేదలకు చేరాల్సిన బియ్యం పచ్చ మాఫియాలకు వ్యాపారంగా మారింది. ఎమ్మెల్యేలు, మంత్రుల కనుసన్నల్లో పచ్చనేతల రేషన్ బియ్యం దందా ఆకాశమే హద్దుగా సాగుతోంది. అధికారుల అండదండలతో గోదాముల నుంచే దోపిడీకి తెరతీస్తున్నారు. రాత్రివేళల్లో టన్నుల కొద్దీ బియ్యం మిల్లులకు తరలిపోతున్నా.. ప్రతి నెలా రూ.కోట్లు చేతులు మారుతున్నా సివిల్ సప్లయీస్, పోలీస్, విజిలెన్స్ శాఖలు పచ్చ మాఫియా బియ్యం బండ్లకు పచ్చజెండా ఊపుతున్నారు. రేషన్ బియ్యానికి పాలిష్ పట్టి.. బ్రాండెడ్ బ్యాగుల్లో ప్యాకింగ్ చేసి మార్కెట్లో అత్యధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టించడం కోసమే నెల్లూరు, కోవూరు, కావలి, కందుకూరుల్లో ప్రత్యేకంగా రైస్ మిల్లులు ఉన్నాయి.

- ఎమ్మెల్యేలు, మంత్రుల కనుసన్నల్లో వ్యాపారం
- ఇందు కోసమే ప్రత్యేకంగా కొన్ని మిల్లులు
- ఆ విషయం తెలిసినా సివిల్ సప్లయీస్, విజిలెన్స్ పట్టించుకోని వైనం
- ప్రతి నెలా 70 శాతం బియ్యం ఇతర రాష్ట్రాలకు, దేశాలకు అక్రమ రవాణా
- పాలిష్ పట్టి అధిక ధరలకు విక్రయం
- స్థానికులు సమాచారంతో పట్టుకున్నా నిబంధనలకు విరుద్ధంగా సీఎస్ డీటీలే రిలీజ్
- జేసీ అధికారాలను లాగేసుకుంటున్న సీఎస్ డీటీలు

నెల్లూరు(పొగతోట): పచ్చ నేతల అండదండలతో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. పేద ప్రజల బియ్యం భారీ స్థాయిలో అక్రమ రవాణా జరుగుతోంది. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం అండగా నిలుస్తోంది. గతంలో చాటుమాటుగా సాగే ఈ వ్యాపారం ప్రస్తుతం బహిరంగంగానే జరుగుతోంది. ఈ రేషన్ మాఫియా నేరుగా ఎంఎల్‌ఎస్ పాయింట్ల గోడౌన్ల నుంచే బియ్యాన్ని నేరుగా మిల్లులకు తరలించే స్థాయికి ఏ స్థాయికి బరితెగించింది. ముఖ్యంగా జిల్లాలో ఎమ్మెల్యేలు, మంత్రుల కనుసన్నల్లోనే ఈ వ్యాపారం జరుగుతోంది. ప్రధానంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సమీప బంధువు సివిల్ సప్లయీస్ శాఖ డైరెక్టర్‌గా ఉండడంతోపాటు ఈ మాఫియాకు కీలక నేతగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ రవాణాతో రూ.కోట్లల్లో దందా

ఈ మాఫియా అధికార యంత్రాంగాన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టి ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు తరలించి రూ.కోట్లు గడిస్తోంది. గతంలో బియ్యం అక్రమ రవాణాకు మాఫియా డాన్‌గా వ్యవహరించిన కీలక వ్యక్తికి షిప్ (ఓడ)లో 20 శాతం వాటా ఉంది. అధికార పార్టీకి చెందిన ఒక సామాన్యమైన వ్యక్తి ఓడలో పార్టనర్ స్థాయికి ఎదిగాడంటే, దీన్ని బట్టి బియ్యం అక్రమ రవాణా ఏస్థాయిలో జరుగుతుందో ఇట్టే అర్థమవుతోంది. జిల్లా నలుమూలల నుంచి, ప్రకాశం, కడప, తిరుపతి జిల్లాల నుంచి అక్రమంగా తరలించిన రేషన్ బియ్యాన్ని నెల్లూరు నగరంలోని రైస్ మిల్లుల్లో పాలిష్ పడుతున్నారు. నగరంలో ఉన్న 100కు పైగా రైస్ మిల్లుల్లో సుమారు 15 పెద్ద రైస్ మిల్లులు పేదల బియ్యం పాలిష్ మాత్రమే పట్టుతాయి. ఆయా రైస్ మిల్లుల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయరు.. మిల్లింగ్ చేయరు.

ప్రతి నెలా మామూళ్లు

జిల్లా వ్యాప్తంగా 1,513 చౌకదుకాణాలు ఉన్నాయి. 7.21 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. చౌకదుకాణాల ద్వారా ప్రతి నెలా 12,500 మెట్రిక్ టన్నుల బియ్యం కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ప్రజాప్రతినిధులు, అధికారులు అందరికీ ప్రతి నెలా మామూళ్లు అందుతున్నాయి. ప్రతి డీలర్ నెల్లూరు ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఈ మాఫియా డానుకు మాత్రమే బియ్యం ఇవ్వాలని తీర్మానం చేశారు. ఆయా నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులకు ప్రతి నెలా రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలు ముడుపులు అందుతున్నాయి. అధికారులకు, పోలీసులకు, విజిలెన్స్ అధికారులకు మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

బియ్యం సేకరణ

ప్రతి నెలా కార్డుల సంఖ్య అధారంగా ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి చౌకదుకాణాలకు రేషన్ సరఫరా చేస్తారు. చౌకదుకాణాల డీలర్లు ప్రతి నెలా 25 నుంచి 30వ తేదీ వరకు దివ్యాంగులు, 65 ఏళ్ల వయస్సు దాటిన కార్డుదారులకు ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి లబ్ధిదారులు 92 వేల మంది ఉన్నారు. డీలర్లు దివ్యాంగులు, వృద్ధుల పేరు చెప్పి చుట్టుపక్కల ఉండే కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసినట్లు వేలిముద్రలు వేయించుకుని నగదు ఇస్తున్నారు. కార్డుదారుల నుంచి కేజీ బియ్యం రూ.12 నుచి రూ.13లకు డీలర్లు కొనుగోలు చేస్తున్నారు. డీలర్లు సేకరించిన బియ్యాన్ని మాఫియా డాన్‌కు కేజీ రూ.17 నుంచి రూ.20లకు విక్రయిస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని పాలిష్ పట్టి బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.50 నుంచి రూ.60లకు విక్రయిస్తున్నారు.

నెలకు 913 టన్నుల బియ్యం పక్కదారి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: సర్వేపల్లి నియోజకవర్గంలోని 205 రేషన్ షాపుల ద్వారా బియ్యం అక్రమ రవాణా నిరాటంకంగా జరుగుతూనే ఉంది. 91,371 మంది కార్డు హోల్డర్లలో కొందరు నేరుగా రేషన్ షాపుల డీలర్లకే అమ్ముకుని నగదు తీసుకుంటున్నారని సమాచారం. మరికొందరు ఆటోల్లో ఇళ్లకు వచ్చి బియ్యం కొనుగోలు చేసే వారికి అమ్ముకుంటున్నారు. డీలర్లు కిలోకు రూ.12 ఇస్తుండగా, ఇళ్లకు వచ్చి సేకరించే వారు రూ.15 కొనుగోలు చేస్తున్నారు. పొదలకూరు చుట్టు పక్కల ప్రాంతాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసేందుకు ఓ ఏజెంట్ ఉన్నాడు. ఆయనకే డీలర్లు తాము సేకరించిన బియ్యాన్ని అందజేయాల్సి ఉంటుంది. తోటపల్లిగూడూరు, ముత్తుకూరు పరిసర ప్రాంతాల్లో మరికొందరు ఏజెంట్లు ఉన్నారు. మనుబోలు, వెంకటాచలం మండలాల నుంచి రేషన్ బియ్యం సేకరించేందుకు నెల్లూరు చెందిన ఏజెంట్లు వస్తున్నట్లు తెలిసింది. ప్రతినెలా సగటున 913 టన్నుల బియ్యం పక్కదారి పడుతున్నట్లు ప్రచారం ఉంది. రూ.లక్షల్లో రేషన్ బియ్యం వ్యాపారాన్ని సాగిస్తున్నారు. పొదలకూరు మీదుగా వెంకటగిరి, కలువాయి మండలాల నుంచి కూడా నెల్లూరు మిల్లులకు అక్రమంగా రాత్రి వేళల్లో తోలుతున్నారు. గతంలో పొదలకూరు పోలీసులకు అక్రమం రేషన్ బియ్యం తోలుతున్న పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం

బియ్యం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బియ్యం అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి సారిస్తాం. బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. టోల్‌ప్లాజాల వద్ద రాత్రి సమయాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఫిర్యాదులు అందితే వెంటనే స్పందించి తనిఖీలు నిర్వహించి వాహనాలను సీజ్ చేస్తున్నాం.

– విజయకుమార్, డీఎస్‌ఓ

మొదటి వారంలోనే ఈ స్థాయిలో..



అనంతసాగరం నుంచి తరలిస్తుండగా పట్టుకొన్న రేషన్ బియ్యం మినీ లారీ (ఫైల్)

రెండు రోజుల కిందట అనంతసాగరం మండలం నుంచి కోవూరు సమీపంలోని రైస్ మిల్లుకు తరలిస్తున్న 190 బస్తాల (9.5 టన్నులు) రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. చౌకదుకాణాల ద్వారా రేషన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభమై మొదటి వారంలోనే ఒక రేషన్ షాపు నుంచి ఈ స్థాయిలో బియ్యం అక్రమ రవాణా చేశారంటే పరిస్థితి అర్థమవుతోంది. బియ్యం మాఫియా డాన్‌కు గుడిపల్లిపాడులో సొంత రైస్ మిల్లుతోపాటు మరో మూడు రైస్ మిల్లులను లీజుకు తీసుకుని బియ్యం పాలిష్ పట్టేందుకు మాత్రమే నిర్వహిస్తున్నాడు. ఉదయగిరి, కావలి, కందుకూరు, ఆత్మకూరు, కలువాయి, రాపూరు, వింజమూరు, పొదలకూరు తదితర ప్రాంతాల నుంచి బియ్యం సేకరిస్తున్నారు. ఆ బియ్యాన్ని గోదాము లు, నిమ్మ, మామిడి, బత్తాయి తోట్ల నిల్వ ఉంచు తున్నారు. రాత్రి సమయాల్లో సమయం చూసుకుని నెల్లూరులోని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు.

పేదల కడుపు కొడుతున్న పచ్చ నేతలు



కొండాపురం మండలం మర్రిగుంటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం (ఫైల్)

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో 246 చౌక దుకాణాల పరిధిలో సుమారు 89 వేల రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్ డీలర్లు దళారులను ఏర్పాటు చేసుకుని లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి కావలి, కొడవలూరు, నెల్లూరుల్లో రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. వీరికి స్థానికంగా పోలీసులు, సివిల్ సప్లయీస్ శాఖలు అండగా ఉంటున్నాయి. అక్కడి నుంచి ముత్తుకూరు పోర్టుకు చేర్చి శ్రీలంకతోపాటు ఆఫ్రికన్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారని సమాచారం. ఉదయగిరి నియోజకవర్గం నుంచి పీడీయస్ బియ్యాన్ని కావలి, జలదంకి మండలాలకు చెందిన ఇద్దరు వ్యాపారులు సేకరించి అక్రమంగా బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. స్థానిక వ్యాపారులు డీలర్లు, లబ్ధిదారుల నుంచి రూ.15 వరకు కేజీ బియ్యం కొనుగోలు చేస్తారు. వారు రేషన్ వ్యాపారం చేసే అక్రమార్కులకు రూ.21లకు అమ్ముతారు. వారు రేషన్ మాఫియాకు రూ.29లకు విక్రయిస్తారు. మూడు నెలల క్రితం జలదంకి మండలానికి చెందిన ఓ పచ్చ నేత అక్రమంగా బియ్యం తరలిస్తుండగా చామదలలో స్థానికులు పట్టించారు. కానీ పోలీసులు లారీలో ఉన్న సరుకులో కొంత భాగం అటోకు ఎక్కించి లారీలో సరుకు బిట్రగుంటలోని ఓ రైస్‌మిల్లుకు తరలించి నేర తీవ్రతను తగ్గించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. రెండు నెలల క్రితం కొండాపురం మండలం మర్రిగుంటలో అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యంను పోలీసులు పట్టుకుని, బొలేరో వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

జాయింట్ కలెక్టర్ విధులు సీఎస్‌డీటీలు

వాహనాలు, లారీలను తనిఖీలు చేసే అధికారం సీఎస్‌డీటీలకు ఉన్నాయి. అనుమానం వచ్చిన వాహనాలను పట్టుకున్న సమయంలో బయట వ్యక్తులు ఆరుగురి ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించాలి. వారి సమక్షంలో శాంపిల్స్ సేకరించాలి. అవి పీడీఎస్, నాన్ పీడీఎస్ అని నిర్ధారణ కోసం డీఎం కార్యాలయానికి పంపించాల్సి ఉంది. అప్పటి వరకు వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించాల్సి ఉంది. పీడీఎస్ అయితే కేసు నమోదు చేసి పట్టుకున్న బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించాలి. నాన్ పీడీఎస్ బియ్యం అయితే వాహనానికి జాయింట్ కలెక్టర్ రిలీజింగ్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంది. దీనికి సంబంధించి ఫైల్ నిర్వహించాల్సి ఉంది. ఈ మధ్య కాలంలో రెండు వాహనాలకు పట్టుకున్న అధికారులు జాయింట్ కలెక్టర్ అనుమతి లేకుండా సీఎస్‌డీటీలే రిలీజింగ్ ఆర్డర్ ఇచ్చేశారు. జాయింట్ కలెక్టర్ విధులను సైతం సీఎస్‌డీటీలు లాగేసుకోవడం వెనుక అధికార పార్టీ నేతలు, రేషన్ మాఫియా అండదండలు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

80 శాతం బియ్యం బ్లాక్ మార్కెట్‌కే..



అనంతసాగరం మండలం వెంగంపల్లి నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఆటో (ఫైల్)

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఆత్మకూరు నియోజకవర్గం డెల్టా, మెట్ట ప్రాంతంగా ఉంది. ఇక్కడి పేద ప్రజలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో 80 శాతానికిపైగా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్లు సమాచారం. ఆత్మకూరు పట్టణంలోని పలు రేషన్ దుకాణాదారుల నుంచి కేజీ రూ.10 కొనుగోలు చేసి ఏజెంట్లకు రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని టెంకాయతోపు రహస్య ప్రాంతంలో స్టాక్ చేసి రాత్రి వేళల్లో మినీ వ్యాన్ల ద్వారా కావలి, నెల్లూరు, తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అనంతసాగరం మండలంలో వెంగంపల్లి, చిలకలమర్రి గ్రామాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని స్టాక్ ఉంచి వారం రోజులకొకసారి నెల్లూరు శివార్లలోని రైస్‌మిల్లులకు తరలిస్తుంటారు. రెండు రోజుల క్రితం అనంతసాగరం మండలం నుంచి తరలించిన 9.5 టన్నుల రేషన్ బియ్యాన్ని కోవూరు సమీపంలో పట్టుకున్న విషయం తెలిసిందే. రేషన్ బియ్యం పంపిణీ మొదలు పెట్టిన వారం రోజులకే (7వ తేదీ నాటికే) ఒక అనంతసాగరం మండలం నుంచే తొమ్మిదిన్నర టన్నుల రేషన్ సేకరించారంటే మిగిలిన మండలాల్లో పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుంది. మంత్రి ఆనం ప్రాతినిథ్యం వహించే అనంతసాగరం మండలంలో బుట్టి మహేష్‌రెడ్డి అనే వ్యక్తి ప్రధాన సూత్రదారుడిగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఆయన ఆధ్వర్యంలో కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వేముల రెడ్డి ఈ బియ్యాన్ని సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మరో బ్యాచ్‌కు చెందిన నలుగురు వ్యక్తులు కొత్తగా రేషన్ బియ్యాన్ని సేకరించే పని మొదలు పెట్టారని సమాచారం. గతంలోనూ వెంగంపల్లి కేంద్రంగా టీడీపీ నాయకులు రేషన్ బియ్యం దందా కొనసాగిస్తూ పట్టుబడిన విషయం తెలిసిందే.

చంద్రశేఖరపురం మిల్లులో పాలిష్



చంద్రశేఖరపురంలోని లక్ష్మీనరసింహసాయి రైస్ మిల్లులో సీజ్ చేసిన రేషన్ బియ్యం (ఫైల్)

కోవూరు: నియోజకవర్గంలో కోవూరు, కొడవలూరు, ఇందుకూరుపేట, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెంల్లో మొత్తం 208 రేషన్ షాపులు, 98,600 కార్డులు ఉన్నాయి. సివిల్ సప్లయీస్ శాఖ డైరెక్టర్ కోవూరు నియోజకవర్గ నేత కావడంతో చంద్రశేఖరపురంలోని ఓ రైస్ మిల్లును అడ్డాగా చేసుకుని ఇక్కడ రేషన్ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నెలకు సగటున 980 టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నాయి. గత ప్రభుత్వంలో ఇంటివద్దకే రేషన్ బియ్యం సరఫరా జరిగేది. దీంతో ఎక్కడా బియ్యం పక్కదారి పట్టేందుకు అవకాశం లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ షాపులనే కబ్జా చేసిన మాఫియా నేరుగా ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి, రేషన్ షాపుల నుంచి బహిరంగంగా తరలిస్తున్నారు. చాలా మంది షాపుల వద్దకు వెళ్లి బియ్యం తెచ్చుకోకపోవడంతో ఇది అక్రమార్కులకు అనుకూలంగా మారింది. కొంతమంది డీలర్లు మీరు రేషన్ బియ్యం తినరు కదా మీకెందుకు బియ్యం వాటి బదులు కేజీకి రూ.10 డబ్బులిస్తామంటూ బేరం మాట్లాడుకొంటున్నారు. గతంలో బుచ్చిరెడ్డిపాళెంలోని కొట్టాల దగ్గర ఉన్న రైస్‌మిల్లు ఉంది. కొడవలూరు మండలంలోని చంద్రశేఖరపురం వద్ద ఓ రైస్ మిల్లు, కోవూరు మండలంలోని జమ్మిపాళెం రోడ్డులో ఉన్న రైసుమిల్లులకు తరలించి పాలిష్ పట్టించి, బ్రాండెడ్ బ్యాగుల్లో ప్యాక్ చేసి పోర్టుల ద్వారా విదేశాలకు, తమిళనాడుకు తరలిపోతున్నాయి.

నీ ఇంటికి వస్తా.. నీ అంతు చూస్తా..

- మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పరుష పదజాలం
- ఆ భాషపై సర్వత్రా విమర్శలు

కావలి (జలదంకి): పదేళ్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ప్రస్తుత ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పరుష పదజాలంతో దూషించారు. చట్టసభలో శాసన సభ్యుడిగా ఉండి.. మారో మాజీ శాసన సభ్యుడిని నోటికొచ్చినట్లు, ఒక వీధి రౌడీలా మాట్లాడిన తీరుపై ప్రజలు యావగించుకుంటున్నారు. తుమ్మలపెంటలో గుర్తుతెలియని వ్యక్తులు జల్‌జీవన్ మిషన్ పథకానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన నేపథ్యంలో పరిశీలించేందుకు శనివారం వచ్చారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి అదుపు తప్పి మాట్లాడుతూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 'ప్రతాప్‌రెడ్డి నీ అంతు చూస్తా, నీ ఇంటికి వస్తా. శవాల మీద పరిగలు ఏరుకునేవాడివి. నువ్వు నా వెంట్రుక, గోటికి కూడా పనికిరావు. నీ భార్యా పిల్లలతో కూర్చోని మాట్లాడుకో.. ఖబడ్దార్' అంటూ ఆవేశంతో ఊగిపోయాడు. అనంతపురం, బెంగళూరు నుంచి రౌడీలను తెచ్చి కావలిలోని లాడ్జిల్లో పెట్టి నీచ రాజకీయాలు చేస్తున్నాడని, కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేటట్లు చేయిస్తున్నాడని, కులాల మధ్య చిచ్చుపెట్టే రాజకీయాలు చేస్తున్నాంటూ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. ఎమ్మెల్యే స్థాయిలో ఉండి కృష్ణారెడ్డి మాట్లాడిన భాష ఏమిటని కావలి నియోజకవర్గ ప్రజల్లో చర్చ మొదలైంది. పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా పని చేసిన వ్యక్తిపై ఇలా వీధి రౌడీలా మాట్లాడడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ వాళ్లే శిలాఫలకాన్ని కూల్చి వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి పొలంలో శిథిలాలు వేసి, తమపైనే అక్రమ కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ తుమ్మలపెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై కావలి రూరల్ పోలీసులను వివరణ కోరగా తమ్మలపెంట పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఇద్దరు వైఎస్సార్‌సీపీ వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారితో శిలాఫలకం కూల్చింది తామే అని చెప్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.


ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడిన పరుష పదజాలాన్ని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వినొచ్చు



మాట్లాడుతున్న కావలి ఎమ్మెల్యే

లులు సంస్థతో లాలూచీలు ఆపండి

- రూ.400 కోట్ల స్థలాన్ని కట్టబెట్టే ప్రయత్నం విరమించుకోవాలి
- ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థ అయిన లులుకు రూ.400 కోట్లు విలువ చేసే స్థలాన్ని కట్టబెట్టే ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్టీసీ ప్రాంగణంలోని ఆ యూనియన్ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ. నారాయణరావు, జిల్లా కార్యదర్శి ఓవీ ప్రసాద్ మాట్లాడారు. విజయవాడ నడిబొడ్డున ఉన్న గవర్నర్‌పేట-1, 2 డిపోలకు సంబంధించిన రూ.400 కోట్లు విలువ చేసే స్థలాలను 99 ఏళ్లకు తక్కువ లీజుకు లులు సంస్థకు కట్టబెట్టడాన్ని తప్పుపట్టారు. లీజుకి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 174 జీఓను వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ సెక్రటరీ బీ మాలాద్రి, జిల్లా ప్రచార కార్యదర్శి వీఎస్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఏ వెంకటేశ్వర్లు, నానో ఆపరేషన్ నాయకులు ఎం పాపయ్య, రాష్ట్ర మెయింటినెన్స్ కమిటీ సభ్యులు అశోక్‌కుమార్, నెల్లూరు-1 డిపో అధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి ఎం.పెంచలయ్య, నెల్లూరు-2 డిపో కార్యదర్శి కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నృసింహునికి తులసీ దళార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: శ్రావణ పౌర్ణమి సందర్భంగా పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి శనివారం తులసీ దళార్చన అత్యంత వైభవంగా జరిగింది. నిత్య కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. మేళతాళాల నడుమ శ్రీవారి నందనంలోని ప్రత్యేక మండపంలో తులసీ దళాలతో ప్రత్యేక పూజలు, ఆదిలక్ష్మీదేవికి కుంకుమార్చన సేవ జరిగింది. రాత్రి బంగారు గరుడ వాహనంపై స్వామి ఉత్సవ విగ్రహం కొలువుదీర్చి అలంకరించారు. కోనలోని మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన కారు

- ఒకరి మృతి, నలుగురికి గాయాలు
- రాజుపాళెం వద్ద ఘటన



ప్రశాంత్ మృతదేహం

ఉలవపాడు: రెండు ద్విచక్ర వాహనాలను కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన 16వ నంబర్ జాతీయ రహదారిపై రాజుపాళెం జంక్షన్ వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. భీమవరం గ్రామానికి చెందిన దేవండ్ల ప్రశాంత్ (28), కల్యాణ్, ఏడేళ్ల వయసున్న సాయికృష్ణ బైక్‌పై ఉలవపాడు నుంచి భీమవరం వెళ్లడానికి రాజుపాళెం జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్నారు. ఈ సమయంలో గూడూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ప్రశాంత్ బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. తర్వాత రోడ్డుమార్జిన్ వైపునకు దూసుకొచ్చింది. ఈ సమయంలో రాజుపాళెం నుంచి ఉలవపాడుకు మరో బైక్‌పై వెళ్తున్న జొన్నాబత్తిన గిరి, మురళీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రశాంత్ మృతిచెందాడు. కల్యాణ్, సాయికృష్ణ తీవ్రంగా, మిగిలిన ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ సిబ్బంది ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడులోని సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన కారు

విషాద ప్రయాణం



మృతిచెందిన అభినయ్‌కృష్ణ



క్రేన్ సాయంతో వాహనాన్ని పక్కకు తీస్తూ..



రోదిస్తున్న బంధువులు



వెంకటనరసమ్మ మృతదేహం

- పెరిగిన రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య
- తొలుత తిరుపతికి రైల్లో వెళ్లాలని అనుకుని..
- తుఫాన్ వాహనంలో బయలుదేరి అనంతలోకాలకు..

ఉలవపాడు: బాలుడికి తిరుమలలో పుట్టు వెంట్రుకలు తీయించి.. దైవ దర్శనం చేసుకుని సంతోషంగా సొంతూరికి చేరుకోవాలని ఆ కుటుంబం అనుకుంది. అన్ని ఏర్పాట్లు చేసుకుని తుఫాన్ వాహనంలో బయలుదేరింది. అయితే విధి మరోలా తలచింది. మృత్యు ప్రయాణంగా మారడంతో తీవ్ర విషాదం నెలకొంది. ఉలవపాడు దాటి చాగల్లు సమీపంలోకి వచ్చే సమయంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తగణేశునిపాడుకు చెందిన ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. ఆస్పత్రికి తరలిస్తుండగా ఒకరు, శనివారం వైద్యశాలలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతిచెందారు.

ఇద్దరూ సచివాలయ ఉద్యోగులు

చిన వెంకటేశ్వర్లు సుభాషిణిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఇద్దరూ కష్టపడి సచివాలయంలో ఉద్యోగాలు సాధించారు. వెంకటేశ్వర్లు పిడుగురాళ్లలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా, సుభాషిణి డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. మూడేళ్ల కుమారుడితో జీవితం సంతోషంగా సాగుతున్న సమయంలో రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని కకావికలం చేసింది. వెంకటేశ్వర్లు తన భార్యను, తల్లి వెంకటనరసమ్మ, కుమారుడు తేజస్విని అభినయకృష్ణను పోగొట్టుకున్నాడు. దైవదర్శనం కోసం వారితో పాటు వెళ్తూ సుభాషిణి తండ్రి యర్రం శ్రీనివాసరావు ప్రాణాలు కోల్పోయాడు. వెంకటేశ్వర్లు అన్న శ్రీనివాసరావు భార్య రుక్మిణమ్మ మరణించడంతో ఆ కుటుంబంలో అంతులేని విషాదం నెలకొంది.

రైల్లో వెళ్లాలని అనుకుని..

ఆ కుటుంబం తొలుత తిరుపతికి రైలులో వెళ్లాలనుకుని ప్లాన్ చేసుకుంది. అందులో ప్రయాణం ప్రశాంతంగా ఉంటుందని శ్రీనివాసరావు అన్నాడు. చిన్నపిల్లలు రైలులో ఇబ్బందులు పడతారు, కారులో అయితే ప్రశాంతంగా పడుకుని నిద్రపోతారు కదా అని వెంకటేశ్వర్లు అనడంతో పిడుగురాళ్లకు చెందిన గంగరాజు అనే వ్యక్తికి సంబంధించిన తుఫాన్ వాహనాన్ని బాడుగకు మాట్లాడుకున్నారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు బయలుదేరి మధ్యలో టీ తాగేందుకు ఆగారు. తిరిగి బయలుదేరిన అరగంటలోపే ప్రమాదం జరిగిందని శ్రీనివాసరావు తెలిపారు.

మృతదేహాల అప్పగింత

ఉలవపాడు సీహెచ్‌సీలో వెంకటనరసమ్మ, సుభాషిణితోపాటు బాలుడు అభినయ్‌కృష్ణకు శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. గ్రామం నుంచి బంధువులు వచ్చి మృతదేహాలను చూసి చలించిపోయారు. నెల్లూరులో యర్రం శ్రీనివాసరావు మృతదేహానికి పోస్టుమార్టం జరిగింది. రుక్మిణమ్మ గుంటూరులో సాయంత్రం చికిత్స పొందుతూ మృతిచెందింది. ఇంకా పోస్టుమార్టం నిర్వహించలేదు. ఉలవపాడు వైద్యశాలలో వారి బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు.

రైలు కిందపడి వ్యక్తి బలవన్మరణం



రైలు ముందు భాగంలో ఇరుక్కుపోయిన మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఏం కష్టమొచ్చిందో తెలియదు గానీ గుర్తుతెలియని వ్యక్తి కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు సమీపంలో శనివారం వందేభారత్ (తిరుపతి – సికింద్రాబాద్) రైలు కింద పడి బలవన్మరణం చెందాడు. మృతదేహం రైలు ముందు భాగంలో ఇరుక్కుపోవడంతో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ వరకు ఈడ్చుకెళ్లింది. అక్కడ సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వయసు 50 నుంచి 55 సంవత్సరాల్లోపు ఉంటుంది. పచ్చరంగు గీతల హాఫ్ హ్యాండ్స్ టీషర్ట్, నలుపు రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా తయారైంది. జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు నమోదు చేశారు.

కోడిపందేలపై దాడులు

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని దొరతోపు కాలనీ సమీప పొలంలో శనివారం కొందరు వ్యక్తులు కోడిపందేలు నిర్వహిస్తుండగా రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసులను చూసిన పలువురు పరారయ్యారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రెండు కోళ్లు, 15 బైక్‌లు, రూ.23 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.



ప్రకృతి గీసిన 'చిత్రం'



భానుడు అస్తమించే వేళలో పల్లెల్లోని దృశ్యాలు కళ్లను మైమరిపిస్తాయి. ముత్తుకూరు ఏపీ జెన్కో రహదారి సమీపంలోని ముసునూరుపాళెం వద్ద పొలం నీటిలో మేఘాలు, తాటిచెట్ల ప్రతిబింబాలు ప్రకృతి గీసిన చిత్రంలా కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ..

- తమిళనాడు వాసి సైకిల్ యాత్ర



ఉదయగిరి: పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన ముత్తు సెల్వన్ సైకిల్ యాత్ర చేపట్టారు. శనివారం ఉదయగిరికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మూడు రాష్ట్రాల్లో యాత్ర పూర్తి చేసి విద్యార్థులకు, ప్రజలకు, పర్యావరణంపై అవగాహన సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో మొక్కలు నాటామన్నారు. అన్ని రాష్ట్రాలతోపాటు ప్రపంచంలోని ఏడు దేశాల్లో యాత్ర చేస్తానన్నారు.

పథకాలు అందాలంటే జగనన్న రావాలి



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న బుర్రా మధుసూదన్‌రావు, నేతలు

- మాజీ ఎమ్మెల్యే, కందుకూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బుర్రా
- చేవూరులో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ
- వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ

గుడ్లూరు: ప్రభుత్వ పథకాలు సక్రమంగా ప్రజలకు అందాలంటే ముఖ్యమంత్రిగా జగనన్న రావాలని మాజీ ఎమ్మెల్యే, కందుకూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని చేవూరులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి బాబు మోసాలను తెలియజేస్తూ ప్రజలతో మాట్లాడారు. అంబేడ్కర్‌ను చూస్తే రాజ్యాంగం, అబ్దుల్ కలాంను చూస్తే రాకెట్లు, ఉపగ్రహాలు గుర్తుకు వచ్చినట్లు చంద్రబాబును చూస్తే దగా, నయవంచన గుర్తుకు వస్తాయన్నారు. బాబు ఎన్నో పథకాలు ఇస్తానని ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. వృద్ధులకు నూతన పెన్షన్ రాలేదన్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వలేదన్నారు. 50 ఏళ్లకే పెన్షన్ అని చెప్పి బడుగు, బలహీనవర్గాలను మోసం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కన్నా ఎక్కువ పథకాలిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల గురించి పట్టించుకోవడం మానేశారన్నారు.

సుపరిపాలన కాదు మోసపూరిత పరిపాలన

తల్లికి వందనం తప్ప ఇంకా ఏ పథకం ఇవ్వలేదన్నారు. అది కూడా అరకొరగా ఇచ్చి కోతలు పెట్టారన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం పెట్టామన్నారు. కానీ ఆ డబ్బులు అందరికీ వేయడం లేదన్నారు. చంద్రబాబు ఇటీవల సుపరిపాలన అనే కార్యక్రమం పెట్టారని, అది మోసపూరిత పరిపాలన అన్నారు. ఎన్నికలప్పుడు ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తామని హామీలిచ్చి అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలియజేశారు. ప్రజలు కూడా ఈ ప్రభుత్వంలో పథకాలు సక్రమంగా అందడం లేదని, జగనన్న ఉన్నప్పుడే పథకాలు సక్రమంగా వచ్చాయని తెలియజేశారు. గడిచిన కాలంలో ప్రజలను ఎలా మోసం చేశారనేది క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఎంత నష్టపోయారని ప్రజలకు వివరించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పులి రమేష్, మండల అధ్యక్షుడు కాపులూరి కృష్ణయాదవ్, ఉపాధ్యక్షుడు బిళ్లా రమణయ్య, జిల్లా నాయకులు తోకల కొండయ్య, చీమలరాజా, రాష్ట్ర నాయకులు గణేశం గంగిరెడ్డి, నియోజకవర్గ నాయకులు నల్లమోతు చంద్రమౌళి, పాలవల్లి అమర్‌నాథ్‌రెడ్డి, షేక్ రహీమ్, చల్లా విఘ్నేష్, నక్కల శరత్, నక్కల రామకృష్ణ, ఎందేటి శేషయ్య, ఇమ్మని నరసింహారావు, ఎల్లంటి శ్రీను, ఏలియా, సుబ్బారాయుడు, నరసింహ, శ్రీను, మల్లికార్జున, రవికాంత్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 25.670 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 25.670 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 4,545 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,575, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.31
సన్నవి : రూ.20
పండ్లు : రూ.8

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.107
లేయర్	రూ.115
బ్రాయిలర్ చికెన్:	రూ.200
స్కిన్‌లెస్ చికెన్:	రూ.220
లేయర్ చికెన్:	రూ.195